**'నిరాశ్రయా నశోభంతే' అని లత విషయంలో అన్నారు. జీవితలత కూడా అంతే. వ్యక్తుల్ని కాక పోతే యేదో ఆశనైనా ఆశ్రయించవలసిందే!**

**వరండాలో కూర్చుని ప్రక్క పోర్షను కమలతో బాతాఖానీ వేస్తున్న రమ "పోష్టు" అన్న కేక వినబడగానే ఛెంగున ముందుకుదూకింది. అందంగా వాలుగువైపులా పసుప్రవాసిన పెద్దకవరు, దానిమీద పొందికగా వ్రాసిన అక్షరాలు చూడగానే అది యెవరి వద్దనుంచో యిట్టే అర్థమయి పోయింది.**

"ఏమిటండోయ్! ఏదో శుభలేఖలా వుంది" అన్న కమలకు.

"మా తమ్ముడి పెళ్ళండీ. ఫిబ్రవరి ఐదున. ఇక మనకు చేతినిండా పనే" అంటూ లోపలి కెళ్ళిపోయింది రమ.

తన ప్రియమైన తమ్ముడు వ్రాసిన కవరును తిరిగి ముద్దు పెట్టుకుంది. తన తమ్ముడి కాబోయే భార్య యెలా వుంటుందో వూహించా లనుకుంది. 'సంసారపక్షంగానా. అతి సామాన్యం గానా లేక అప్సరసగానా. అతి మంచిదాని గానా. కోపిష్టిగానా. గర్విష్టిగానా' ఊహు! ఊహకందటంలేదు.

"నాలుగయిదు సంబంధా లున్నాయి. అందులో ఏదో ఒకటి కుదిర్చేయాలని వుంది. రమా! నువ్వూ అల్లుడూ. పాపను. బాబునుతీసుకొని రావలసింది" అనిఅమ్మ నాలుగయిదుసార్లు ఉత్తరాలు వ్రాయించినా నారాయణ 'సెలవు లేదు వీల్లేదు' అన్నాడు. "నువ్వు వెళ్ళి అక్కడ నెలల తరబడి తిష్టవేస్తే నేనెలా వుండగలను రమా! మొన్ననేకదా ఆర్నెల్లుండి వచ్చావు. ఈ చంటివాడితో నువ్వొక్కదానివే ప్రయాణం కడితే కష్టం. అయినా పెళ్ళిచేసుకోబోయేది నీ తమ్ముడు. బ్రతికున్నన్నాళ్ళు భరించవలసింది అతను. బ్రతికి వున్నన్నాళ్ళు కోడలుతో కలిసి వుండవలసినది మీ అమ్మగారు. వాళ్ళు చూచుకోటంలో అర్థం వుందిగానినువ్వూ. నేనూ చూస్తానంటే లోకం విరగబడి నవ్వుతుందోయ్— అయినా నీ కట్నకానుకలకు లోటు చెయ్యవద్దని మీ తమ్ముడుకు వ్రాస్తాలేవోయ్." అంటూ భార్యబుగ్గమీద చిటికేస్తూ ఆ ప్రయాణం ఆపుచేయించాడు నారాయణ. అదిగో దాని ఫలితమే ఈరోజు రమ తన కాబోయే మరదలును వూహించుకోలేక సతమతమైపోతుంది.

మెల్లగా కవరు విప్పింది. వంశీ మోహన్ ప్రక్కన చి॥ కామేశ్వరి అన్న పేరు చూడగానే రమకు బోల్డంత నిరుత్సాహం వచ్చింది. అంత అందమైన తమ్ముడి పేరు ప్రక్కన ఆ పేరు ఎబ్బెట్టుగా అగుపించింది. ఇంక అమ్మాయెలా వుంటుందో. పెళ్ళిచూపులప్పుడు తను లేకపోవటం యెంత తప్పయిపోయింది. అందమైన అమ్మాయిని. మంచిపేరుగల అమ్మాయిని సెలక్టు చేసివుండేది. లేదా పేరైనా మార్చి వుండేది.

తమ్ముడి వుత్తరం విప్పింది. "ప్రియమైన అక్కకు. పూజ్యులైన బావగార్కి. నమస్కరించి వంశీ మోహను వ్రాయునది. అక్కా! నా పెళ్ళి ఫిబ్రవరి ఐదున నిశ్చయమైనది. పెళ్ళిచూపులప్పుడు నువ్వూ. బావగారూ లేకపోవటం మాకు చాలా నిరుత్సాహం కలిగించింది. అమ్మాయి అమ్మకు నచ్చింది." నవ్వుకుంది రమ. అమ్మకేగాని వాడికి నచ్చలేదా! "అక్కా! నిన్నూ. బావగార్ని తీసుకురావటానికి అమ్మ నన్ను హైద్రాబాదు వెళ్ళమంది. కానీ నాకే రావాలనిపించటంలేదు. నీకన్నా చిన్నవాడిని. నువ్వూ. బావగారే వచ్చి ఆశీర్వదించాలి. దగ్గరుండి పెళ్ళిపనులు చేయించాలి. అప్పుడే నాకు ఆనందం. నాకు పెళ్ళి కుదిరింది కాబట్టి మీరు రండి అని స్వయంగా వచ్చి పిలవటానికి నాకు సిగ్గుగావుందక్కా. దయవుంచి అన్యధా భావించకుండా మీరిద్దరూ రావలసినది. బావగారు మరోలా భావించరని తలుస్తాను. సునీతకు. శ్రీకాంత్‌కు నా ముద్దులు" అంటూ మరోసారి రమ్మనికోరి తల్లి ఆశీస్సులు తెలుపుతూ ఉత్తరం ముగించాడు వంశీమోహను

నవ్వుకుంది రమ. తనకంటే ఐదారేళ్ళ చిన్నవాడు. ఆర్థిక పరిస్థితుల మూలంగా పై చదువులు చదవాలని వున్నా చదవలేక పోయాడు. మగ దక్షతలేని కుటుంబం. తన పెళ్ళయేసరికి చాలా వరకు కూడబెట్టిన సొమ్మంతా కరిగిపోగా ఓ ఐదారు



వేలు అప్పు మిగిలింది. ఈ ఆర్థిక ఇబ్బందులలో వంశీ చదువుకు, గ్రాడ్యుయేషనుతో పుల్‌స్టాపు పెట్టేసి బి. యిడి. చేశాడు. ఉన్న వూళ్ళోనే ఎలాగో తంటాలుపడి టీచరు ఉద్యోగంలో చేరాడు. ఇప్పుడు ఇంటి పరిస్థితి కాస్త మెరుగే. బాగా చెప్తాడని పేరు రావడంవలన ప్రైవేట్లు పెరిగాయి. అప్పులుతీరి ఆర్థికంగా నిలబడగలిగాడు.

"ఏమిటండీ! చాలా హుషారుగా వున్నారు యీవేళ" అంటూ వచ్చాడు నారాయణ.

చిరునవ్వుతో పలకరించి కాఫీ తేవటానికెళ్ళింది రమ.

"హాయ్! మా బామ్మర్ది పెళ్ళికొడుకాయనే. మా రమమ్మ ఆడబడుచాయనే" అంటూ రాగాలు తీశాడు నారాయణ.

"చాల్లెండి చోద్యం! ఎప్పుడండీ ప్రయాణం?" గోముగా ప్రశ్నించింది.

"ఏమిటీ! పెళ్ళికొడుకు స్వయానా నీ తమ్ముడు, నా బావమరిది. వరసలుగా వచ్చి పిలవకుండానే వెళ్ళటమా! హవ్వ! యెంత లోకువ. పరువు తక్కువ. నో!" అంటూ భార్యవైపు చూశాడు.

అందాకట్నుంచీ బెరుకుగానే వుంది రమ మనస్సులో. ఈయన మంచివారే. ఈయన ఒప్పుకున్నా ఆరాలుతీసి రేపు యీయన తరుపువారు ఏమైనా సూటీపోటీ మాటలనవచ్చు. ముఖ్యంగా అవి జ్ఞాపకం వస్తే యీయనేమంటారోనని అనుకున్న క్షణం రానే వచ్చింది. ఇంక అలాగే సీరియస్‌గా అంటూవుంటే బిక్కమొహంవేసి జాలిగా. జాలిగా చూస్తున్న రమను చూడగానే నవ్వాపుకోలేకపోయాడు నారాయణ. "నో!" అంటూ మరొకసారి గట్టిగా అని "నాకు నా బావమరిది చి|| వంశీమోహనుపై చాలా కోపం వచ్చింది. వెంటనే ఈ వారంలో బయలుదేరి వెళ్ళి పెళ్ళవగానే మా చెల్లెలిచేత మూడు చెరువుల నీరు త్రాగింపచేసి నా అక్కసు తీర్చుకోకపోతే నేను రమ మొగుడ్ని కానే కాను." అంటూ శపథంచేస్తున్న అల్లరి మొగుడివైపు ఆనందంగా చూసింది రమ. సంతోషం పట్టలేక దగ్గరకెళ్ళి "ఏమండీ మీరు చాలా మంచివారండీ!" అంటూ చేతులు పట్టుకుంది.

"నేను చాలా మంచివాడినని పుట్టగానే మా అమ్మా, నాన్నా చెప్పారు లేవోయ్. నేను చాలా మంచి వాడ్నిగదా! ఏదీ ఒక్కటీ...." అంటూ చెంప చూపించాడు.

"ఛీ! పొండి!" అంటూ లేడిలా వంట గదిలోకి పరుగెత్తింది.

పదిహేను రోజుల ముందరే సెలవు సంపాదించి ఆ యిద్దరూ తమ యిద్దరి



# కొత్త జీవితం

పి. జయలక్ష్మి

సంతానంతో అత్తారింట్లో అడుగుపెట్టారు. పెళ్ళి పనులన్నీ తామే యింటికి పెద్ద దిక్కుగా నిలిచి, పెళ్ళి వున్నదాంట్లో ఆర్భాటంగా, అందంగా జరిపించాడు నారాయణ.

నారాయణవైపు వారు చెవులు కొరుక్కోక పోలేదు. చెల్లెలి పెళ్ళికి అన్నగారి కూతురి పెళ్ళికి వారం ముందు మొక్కుబడిగా వచ్చి వెళ్ళిపోయాడని యింత చాకచక్యంగా, పనులు నెత్తిమీద వేసుకు తిరగ లేదనీ.

అయితే అక్కడ పనులు చేయించే వారొకరూ, పైకం చెల్లించేవారొకరూమా పెత్తనంచేసే వారొకరూ, చాకిరీ చేసే వారొకరూను! అయినా అక్కడ స్వయంగా మనమేమైనా ఆర్భాటంగా చేయాలంటే మన చేతి చమురు వదులుతుంది. మరి



ఉషా
టేబుల్ మరియు
సీలింగ్ ఫ్యానులకు
సంప్రదించండి
శ్రీసీతారామా ఎలక్ట్రికల్స్
సామారంగం చౌక్
విజయవాడ-520001
ఫోన్: 74039.

డా|| పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్సు స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయ నవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.

రాపూస్ క్లినిక్
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700, 1010.

SUVARNA

FREE FREE
తెల్ల మచ్చలు
"శ్వేత్రమోచన్" ఆయుర్వేద ఔషధాన్ని వాడిన మచ్చల రంగు మూడు దినములలో మారగలదు. వేలకొలది ప్రజలు దీనిని గొప్పగా కొనియాడి యున్నారు. ప్రచారం కొరకు ఒక పీసా మందు ఉచితంగా పంపుతాము. వెంటనే వ్రాయండి.
INDIRA AYURVED Bhavan (4)
P O: Katri Sarai (Gaya)


యిక్కడో అత్తగారు మొత్తం పెత్తనమంతా యిచ్చేసి తనకు సామర్ధ్యమున్నంత డబ్బు చేతిలోపెట్టి "బాబూ! నువ్వే పెద్ద దిక్కువి. ఇంటల్లుడివి. చిన్నవాడు వాడి పెళ్ళి యెలా చేయిస్తావో అంతా నీదే భారం" అంటూ ఒప్పచెప్పేసింది. ఈ పెత్తనం తనకక్కడ యెవరిస్తారు. పెళ్ళి ఝామ్మని జరిగిపోయింది. పెళ్ళి కొడుకు తరపువారు అధికులమంటూ అధికారాలు చెలాయించలేదు. పెళ్ళి కూతురు తరపువారు అలాగని యేలోటూ చెయ్యలేదు. మొత్తంమీద హాయిగా గడిచిపోయాయి నెల రోజుల సెలవలు. పెళ్ళి కూతురు నలుపైనా చాలా కళగా వుంది. కృష్ణానదీ తరంగాలలా నొక్కు నొక్కులుగా వత్తయిన జుట్టు. చక్కని కనుముక్కు తీరు. లోకంలో సగానికిపైగా ఆడ జనాభే అయినా, అందులో అనేక మంది అప్సరసలే అయినా బహు కొద్ది మంది నవ్వే చూడముచ్చటగా, విన సొంపుగా, ఆహ్లాదంగా వుంటుంది. నవ్వినపుడు తళుక్కుమనే చక్కని పలువరసతో, సొట్టలుపడే బుగ్గలతో, సన్నని చిన్ని పెదవులతో. ఆ నవ్వుతో లోకాలనే జయించవచ్చు. అంత అందమైన నవ్వది. ఆఫ్టరాల్ వంశీమోహనెంత.

మరదలి రూపంలో కొంత నిరాశ వ్యక్తపరిచిన రమతో "పోవోయ్! నువ్వొక రంభవన్నట్లు మా చెల్లికి వంకలు పెడతావేం? నీ కంటికి నీ తమ్ముడొక మన్మథుడు. నలకూబరుడు కావచ్చు కాని నాకు మటుకు విష్ణుమూర్తి వాహనంలా వున్నాడోయ్ముఖ్యంగా ఆ ముక్కుచూస్తే" 'వూ(' అంటూ భార్య రోషాంకితమైన అరుణవర్ణాన్ని పులుముకుంటున్న వదనం చూసి అర్థోక్తిలో ఆగిపోయాడు.

ఆ రోజు శోభనం రోజు. రమ యెంత అల్లరిచేసింది. తన స్వంత ఖర్చుతో కొంత అవతలివారి ఖర్చుకొంత కలిపి ఆ గదిని, మంచాన్ని సినిమాలలో చూపే సెట్టులా తయారుచేసింది. కామేశ్వరి కలుపుగోలుతనం, అమాయకత్వం రమను ఆకట్టుకున్నాయి. చిలిపిగా యెవరూ చూడకుండా కామేశ్వరిని ఆ గదిలోకి తీసుకువచ్చింది. కామేశ్వరి తెగ సిగ్గు పడిపోయి మెలికలుతిరిగిపోయి, పారిపోబోతుంటే ఆపి తన తమ్ముడి ముచ్చటలను చెప్పటం మొదలెట్టింది. భర్త పేరు వినగానే యింకా కంగారుపడిపోయి, సిగ్గుపడుతున్న మరదలును పట్టుకుని మొదటి రాత్రి భయం పోగొట్టి యెట్టకేలకు వదిలి పెట్టింది.

రమంటే అదో రకమైన అభిమానం, గౌరవం కల్గాయి కామేశ్వరికి. నారాయణ కూడా రమకు తగ్గవాడే. వాళ్ళిద్దరూ యెప్పుడు వచ్చినా కామేశ్వరికి చాలా సందడిగా, నిండుగా అనిపించేది. పిల్లలు కూడా చాలా బుద్ధిమంతులు. కామేశ్వరంటే రమకూ అభిమానమే. వయసులు మరిచి, వరసలు మరిచి గంటలు గంటలు కబుర్లు చెప్పుకునేవారు. అత్తగారూ భర్తా చాలా మంచివారైనా భర్తతో అలా సరదాగా కబుర్లు చెప్పుకోవాలన్నా హాస్యోక్తి విసరాలన్నా అత్తగారి యెదుట బాగోదని కిమ్మనకపోవటం అలవాటయిపోయింది కామేశ్వరికి.

ఇంత చక్కని జీవితం యిలానే చివరిదాకా గడిచిపోతే యెంత బాగుండేది? తను చదువుకొన్నది. విజ్ఞానం వుంది. తనెందుకిలా రాక్షసిలా ప్రవర్తిస్తోంది? వరండాలో స్తంభాన్నానుకుని కూర్చున్న రమ ఆలోచిస్తోంది.

"అవును-వదిన యెందుకింత కఠినంగా, అమానుషంగా తయారైంది. హాస్యోక్తులు వినదగిన మాటలు తప్ప మరొకటి పలుకని రమ యింత కఠినమైన యీటెల్లాంటి మాటలనెలా అనగల్గుతోంది." పెరటిలో మల్లెపందిరి గుంజ నానుకుని కూర్చున్న రమ దిగులుగా వుంది. వంటింటి గడపలో కూర్చున్న సుందరమ్మగారు అటు కూతురిని, యిటు కోడలిని చూస్తూ వుస్సురని నిట్టూర్చారు. ఒకప్పుడు ప్రాణ స్నేహితుల్లా మసిలారు. ఈ రోజు బద్ధ శత్రువుల్లా వున్నారు. అలా అని ద్వేషించుకోవటం లేదు. దెయ్యం పట్టినట్లు ఒక్కోసారి రమ కామేశ్వరిపైనా, తమ్ముడిపైనా విరుచుకు పడుతుంది. మొదట్లో కామేశ్వరి కర్థమయేదికాదు. వంశీ మొదట్లో బాధపడినా తర్వాత రమను జాగ్రత్తగా గమనిస్తూ ఆమె మనోస్థితిని అంచనా వెయ్యసాగాడు.

అనురాగపూరితుడైన భర్త సమక్షంలో ఎంతో ఆనందదాయకమైన స్వర్గంలాంటి సంసారాన్ని గడిపింది రమ. పుట్టింట్లో ఆమెకు లోటు జరగలేదు. భర్తవద్ద అంతే. ముత్యాల్లాంటి యిద్దరు పిల్లలు. ఫ్లూలాగా మొదలయిన జ్వరము విష జ్వరంలోకి దించి నెలలోపులో కళ్ళు మూశాడు నారాయణ. ఆ షాకుకు తట్టుకోలేకపోయింది. దానికితోడు పల్లెటూరేమో, పుట్టింట్లో ప్రతిఒక్కరూ వచ్చి సానుభూతి, జాలి చూపించడము సహించలేకపోతుంది. వారాలు, నెలలూ గడిచిన కొలదీ ఆమెలోని సహనం తగ్గిపోయి, అశాంతి, చిరాకు పెరిగిపోసాగాయి. భర్తపోగానే నాలుగేళ్ల పాప ఏణ్ణర్ధం బాబుతో పుట్టింటికి వచ్చింది

రమ. కష్టంలో వుందికదాని రమనెవ్వరూ పట్టించుకునేవారు కాదు. పిల్లల సంరక్షణ సుందరమ్మ. కామేశ్వరి చేసేవారు. చేతినిండా పనిలేక బుర్రనిండా పనికి మాలిన ఆలోచనలు. కసి- యెవరిమీదో తెలియని కసి. యేమీ చెయ్యలేని నిస్సహాయత. రానురాను కామేశ్వరి, వంశీ కలిసివున్నా సరదాగా కబుర్లు చెప్పుకున్నా సహించేది కాదు. ఆ కోపం యీ కోపం కామేశ్వరిపై చూపించేది. మొదట్లో కామేశ్వరి యేమీ అనేదికాదు. తామిద్దరూ ఒకటిగా కలుసుకున్నవేళ, కబుర్లు చెప్పుకునేవేళ ఆమెకు ఆమె భర్త, సంసారం గుర్తుకు వస్తున్నారు. భర్త పొందు కావాలనిపిస్తోంది.పోయిన భర్త రాడు, రాలేడు. ఇద్దరు పిల్లల తల్లి.మరీ మగవాని తోడును ఆలోచించ నియ్యటంలేదు. ఎలా ? తన కోరికలు తీరేదెలా?

రోజూ అనవసరంగా వదే మాటలు కామేశ్వరిని రెచ్చగొట్టుతున్నాయి. ఇంట్లో వున్న కాస్సేపే ఈ గొడవ భరించలేక పోతున్నాడు. మరి వుదయంనుండి నిద్ర పోయేవరకు కామేశ్వరి ఈ స్థితిని యెలా భరిస్తుంది. రక్తసంబంధంకాదు. కామేశ్వరి మాటకుమాట జవాబిస్తుంది. వంశీ పనిమీద గుంటూరు వెళ్ళినపుడు తన స్నేహితుని ద్వారా పేరుగాంచిన మనస్తత్వ డాక్టర్‌ను కలిశాడు." ఆమె యిష్టపడితే మరో పెళ్ళి మంచి పరిష్కార మార్గ"మన్నాడు. భారత దేశంలో యిద్దరుపిల్లల తల్లికి మరోపెళ్ళి సంభవమా ? ? పోనీ పిల్లల్ని పెంచే స్తోమత తనకులేదు. ఇకపోతే రెండవ మార్గం, చేతి నిండా పని - వీలుంటే యిల్లు విడిచి బయట ప్రపంచంతో సంబంధ బాంధవ్యాలు కలిగిన వుద్యోగము.

వెంటనే వంశీ బయలుదేరి హైద్రాబాదు వెళ్ళాడు. బావగారు పనిచేసే ఆఫీసులో యితర కంపెనీలలో తనకు తెలిసిన వారి ద్వారా ప్రయత్నాలు చేసి వచ్చాడు.

ఇంటికి వస్తూనే తల్లి ఒకప్రక్కన. కామేశ్వరి యింకో ప్రక్కన. రమ యింకోచోట దిగులుగా కూర్చునివుండడం చూశాడు. బిక్కుబిక్కుమంటున్న పిల్లలను చేరదీసి బుజ్జగించి మిఠాయిలు పెట్టాడు.

"కాముడూ !" అంటూ భార్యను గదిలోకి పిలిచాడు.

"ఛీ!పట్టపగలే నరసాలుకాబోలు. ఎనిమిదవ లేదింకా ! అయినా కాముడూ ! గీముడూ ! అంటూ ఆ ప్రేలాపనలేంటి" అంటూ పళ్ళు కొరుక్కుంది రమ.

"రమా !" సుందరమ్మ లాలనగా కూతురు తలను నిమిరింది. "నువ్వు చిన్న దానివికాదు, తెలివితక్కువ దానివీ కాదు. భగవంతుడు నిన్ను చిన్నచూపు చూస్తే దానికి యితరులను నిందించి ప్రయోజనమేమైనా వుందా తల్లీ ! ఆరేళ్ళపాటు సంసారం చేసినదానివి. నువ్వూ, నీ మొగుడూ ఎంత సరదాగా, చిలకా గోరింకల్లా వుండేవారు చెప్పు. నీకన్నా చిన్నవాళ్లు వాళ్ళిద్దరూ. వయసులో వున్నవారు. పెళ్ళయి రెండేళ్లు కూడా నిండని వాళ్ళు. పిల్లాపీచూ లేరు. వాళ్ళు అలా ఆనందంగా వుంటే చూసి సంతోషించాలే తల్లీ ! ఏ జన్మలో యే పాపంచేశామో, ఏ దంపతులను విడదీశామో, ఏ పాపిష్టి పనులు చేశామో యీనాడు మనం యిలా ఖర్మ అనుభవిస్తున్నాము. ఇంకా లేనిపోని పాపం మనకెందుకమ్మా ! రత్నాల్లాంటి బిడ్డలు. నువ్వు పూర్వపు రమవైపోతే, నీ బాధ నాకు తెలుసమ్మా ! వయసులో భర్త పోతే, యిటు సమాజపు కట్టుబాట్లు, ఆచారాలు, అటు కోరికలు నలిపేస్తుంటే ఆడదానిగా నాకా యాతన తెలుసమ్మా ! తప్పదు. మనం ఒంటరివాళ్ళంకాదు. మన వారి శ్రేయస్సు కొరకు, పిల్లల ముందు జీవితం కొరకు గుండె రాయి చేసుకుని, కోరికలు చంపుకొని ధైర్యంగా బ్రతకాలమ్మా ! నీకంటే నా పరిస్థితి యింకా అధ్వాన్నంకదా తల్లీ.నీకు ఇప్పుడు ముప్ఫయి దగ్గరపడుతున్నాయి. పద్దెనిమిది నిండకుండానే యిద్దరు బిడ్డల తల్లినై, భర్తకు దూరమై, అంతో యింతో ఆస్తి

# మల్లెపందిరి

## తలుపు తీస్తే చోరుడో, జారుడో!

తలుపు తీయవే భామా అంటే అది శ్రీకృష్ణుడే. అయితే ఆ తీసే భామ ముందు నువ్వెవరో చెప్పు అంటుంది. అతడు సహస్ర విధాల తన ఆచూకీ ఇచ్చినా ఆవిడ సహస్ర విధాల పెడర్థాలు చెప్పి అతణ్ణి అతడు కాదని నిరూపిస్తూంటే అతడేం చేస్తాడు. చిటపట చినుకుల దుప్పటి తడుస్తూ ఉండగా అలాగే వుండిపోతాడు.

(లీలాశుకుడు)

అంగుల్యా కః కవాటం ప్రహరతి?

కుటిలే మాధవః

కిం వసన్తో?

నో చక్రి

కిం కులాలః?

నహి ధరణిధరః

కిం ద్విజిహ్వః ఫణీంద్రః?

నాహం ఘోరాహి మర్దీ

కిమసి ఖగపతిః?

నో, హరిః

కిం కపీన్ద్రః?

ఇత్యేవం గోపకన్యా ప్రతివచన జితః పాతు వశ్చక్రపాణిః॥

"ఎవరా తలుపు తట్టేది ?" "కుటిలురాలా మాధవుడను" "అంటే, వసంతుడవా?" (మాధవుడు=వసంతుడు) "నో చక్రిని" "ఓహో చక్రం పట్టుకునే- కుమ్మరివా?" "కాదు ధరణిధరుడను" (రాజును నేను అనడం.) "అనగా రెండు నాల్కల శేషసర్పానివా ?" "కాదు. ఘోర సర్పాన్ని (కాళీయుణ్ణి) మర్దించినవాణ్ణి" "అంటే గరుత్మంతుడ వన్నమాట" "కాదు హరిని" "ఓ కపీంద్రుడవా?" అంటూన్న గోపకన్య ముందు ఓడిపోయాడు.

—సౌభరి



ఎంత ఘాటు ప్రేమయో?

రూపసుందరి గుణసుందరి ఆనంద మందిరోద్యానవనంలో కలుసుకున్నారు. రూపసుందరిని ముందు ప్రేమించిన వ్యక్తే, ఆ రాకుమారుడే గుణసుందరిని ప్రస్తుతం ప్రేమిస్తున్నాడని వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోబోతున్నారనీ తెలిసింది. అప్పుడు రూపసుందరి



గుణసుందరితో యిలా అంది :

"గుణా! నీవు అవిక్రమపరాక్రమో ద్దండ పుద్దండ పిండ యువరాజు చంద్ర కిరణ మోహనుడ్ని పెళ్ళాడ్డానికి అంగీక రించావని తెలిసింది నిజమేనా?" అనగా ఆమె తల వూపింది. అప్పుడు రూప సుందరి :

"ఉద్దండ పిండ యువరాజు చంద్ర కిరణ మోహనుడు ముందు నన్ను ప్రేమించినట్లు నీతో అన్నాడా గుణా!" అని రెట్టించి అడిగింది.

"ప్రత్యేకంగా నీ గురించి అని చెప్ప లేదుగాని, తన జీవితంలో ఇంతక్రితం బుద్ధ తెలివితక్కువ పనులెన్నో చేశానని చింతిస్తూ చెప్పాడు రూపా" అంది గుణ సుందరి.

★

బహుపాద జీవివా?

ఓ ఆసామీ కాలుమీంచి కారుపోయింది. కాడాయన్ని కాలు పోయిన ఆయన దావా వేసి కోర్టులో పదివేలు నష్టపరిహారం అడి గాడు. దానికా కారేశ్వరరావు "నేనేం కోటీ శ్వరుణ్ణనుకుంటున్నారా కాలేశ్వర్రా" అని ప్రశ్నించగా- కాలుకాలిన పిల్లిలా ఆ కారా యన్తో కాలాయన "నేనేవి బహుపాద జీవినా లేక చతుష్పాదినా. నాకున్నవి రెండే కాళ్ళాయె"అని ఎదురు సమాధానం చెప్పి నోరు మూయించాడు.

పున్నా నా అనేవాళ్ళులేక. ఆదరించేవారులేక ఓహో!.... వద్దులే తల్లీ! గతం చాలా భయంకరం! గుర్తుచేసుకోకూడదు. అప్ప టికీ యిప్పటికీ పరిస్థితులలో యెంత తేడా! నువ్వు బయట తిరగవచ్చు. ఉద్యోగము చెయ్యవచ్చు. పిల్లలను మన్ననులుగా తీర్చి దిద్దుకో రమా! కామేశ్వరి చాలా సహనవతురాలు. మంచిది కాబట్టి సరిపోయింది కాని లేకపోతే వారిద్దరూ వేరెళ్ళిపోయినా, లేక మనం బయటకు వెళ్ళిపోవలసివచ్చినా పరిస్థితి ఆలోచించు. పూర్వపు నీ ప్రవర్తనను యిప్పటి ప్రవర్తనతో పోల్చిచూడు. కష్టా లకు యెదురీదాలమ్మా! నువ్వు నవ్వుతూ, హాయిగా వుంటేనే యీ ముసలిప్రాణం నిలబడుతుంది. నువ్విలా వుంటే పిల్లలే మవుతారో ఆలోచించావా? తమ్ముడ్ని విసిగించకు రమా!" తల్లీ కూతుళ్ళిద్దరూ ఒకరి కౌగిలిలో ఒకరు. ఇద్దరి కన్నీళ్ళు వరదలై ప్రవహించసాగాయి. తుఫాను గాలి తర్వాత ఆవరించిన ప్రశాంతత ఆ యిద్దరి మనస్సులలోనూ కలిగింది. కన్నీ టికి యెంత మహత్యముంది!

పిల్లల ప్రస్తావన రాగానే రమ హృదయం ఒక్కసారి రెపరెపలాడి వారి మీద ప్రేమ "వటుడింతై, అంతై" అన్నట్లు పెరిగిపోయింది. తల్లి హృదయం మేల్కొంది. వారికి స్వయంగా స్నానం చేయించి, స్వహస్తాలతో అన్నం తిని పించి ఎంతకాలం అయింది. "అమ్మ చెప్పింది నిజం. ఆ గతించిన మధుర స్మృతులతో జీవితమంతా పిల్లల కోస మైనా నవ్వుతూ బ్రతకాలి" మసక వెన్నెల్లో కూతురి మొహంలోని మార్పులు, దృఢ నిశ్చయం చూపిన సుందరమ్మ మనసు హాయిగా నిట్టూర్చింది. చెమర్చిన కళ్ళు తుడుచుకుని పాలదాలి చూడటానికి వెళ్ళింది. రమ లేచి హాలులోకి వచ్చింది.

"ఏమండీ! స్వీట్లు తెచ్చారు బాగుంది. పళ్ళు, పిల్లలకు ఆట వస్తువులు తెచ్చారు. యింకా బాగుంది. పూలెందుకండీ!" రమ మనస్సు చివుక్కుమంది. "మన పెరట్లో పూలు తక్కువైనాయనా! వదినగారింకా అన్నగారుపోయిన దుఃఖంలోంచి బయట పడలేదు. ఇలా మీరు చాటుగా తేవటం. నేను భయపడుతూ, భయపడుతూ పెట్టు కోవటం" కామేశ్వరి గొంతు చిన్నగా వినిపిస్తుంది.

"కాముడూ! నీకు సన్నజాజులంటే యిష్టంగదాని" తమ్ముడిగొంతు తప్పుచేసి నట్లుగా, గిల్టీగావుంది.

"నా ఖర్మ! నాకు యే పూలన్నా తగని పిచ్చి. అందులో సన్నజాజులంటే యింకా మోజండీ. ఇంతకుముందు మీ అక్క గారికి స్వయంగా నన్ను ముస్తాబు చేస్తే కాని మనసొప్పేది కాదు. ఇప్పుడు నా ప్రారబ్ధంకొలదీ నేను ఏమాత్రం పాడాగా తయారయినా, మీ దగ్గరకొస్తున్నా ఆవిడ మనస్సు బాధపడుతుంది. నేనేం చేయను చెప్పండి. మిమ్మల్ని సుఖపెట్టలేకపోతు న్నాను. కోపీ కొన్నాళ్ళు సెలవు పెట్టండి. హాయిగా ఓ నెల రోజులు మా అన్న య్యలు, అక్కయ్యల దగ్గరకెళ్ళి వద్దాం" ఆమె కంఠం రుద్ధమైంది.

వంశీ ఆమెను దగ్గరగా తీసుకున్నాడు. "కామేశ్వరీ! ప్రతి స్త్రీకి అలంకరణల మీదా, పూలమీదా, చీరలమీదా మోజు వుంటుంది. కోరికలుంటాయి. భర్త ద్వారా భార్యకు సంక్రమించినవి మంగళ సూత్రాలు. మరైలా అయితే మనం నిర్దా క్షిణ్యంగా పుట్టుకతో స్త్రీకి సంక్రమించిన హక్కులను కూడా పూడబెరుక్కుని, సంఘం అనే యినుప చట్రాల మధ్య నలిపేస్తున్నాము. అక్క స్థితిలో వున్నా నువ్వు వూహించుకో." చప్పున కామే శ్వరి భర్త నోరుమూసింది.

"నిజం కాముడూ! అక్క పరిస్థితి నర్థం చేసుకో. జాలిపడు. అంతేగాని కోప్పడకు. ఆమె మూలాన యింట్లో సుఖ శాంతులు కరువైనాయని, మనమధ్య దూరం పెరిగిందనీ నాకు తెలుసు. కాని ఆమె నా తోబుట్టువు. ఇద్దరం ఒకరక్తం, పంచుకు పుట్టినవాళ్ళం."

ఏడుస్తున్న భార్య తలను లాలనగా నిమురుతూ కన్నీళ్ళు తుడిచాడు. "నేను గుంటూరు నుండి హైద్రాబాద్ వెళ్ళాను" "ఏమిటీ!" గదిలోని కామేశ్వరి గది బయటనున్న రమా ఇద్దరూ ఆశ్చర్య పోయారు.

"ఎందుకంత ఆశ్చర్యం! ఆ క్కను ఒకరిని కలిసి అక్క పరిస్థితి వివరించాను. వారు ఈ వాతావరణానికి దూరంగా వుంచి చేతినిండా పని కల్పిస్తే మామూలు మని షవుతుందన్నారు. అందుకనే హైద్రాబాద్ వెళ్ళి బావ ఆఫీసులోనూ, యితర చోట్లా ఉద్యోగ ప్రయత్నాలు చేసి వచ్చాను."

"ఎవరికి? మీకా! లేక" అనుమానా స్పదంగా అడిగింది "వదినగారికా!"

"పిచ్చి! రామాయణమంతా విని రాముడికి సీతేమయిందన్నట్లు వుంది నీ ప్రశ్న. అక్కకే. అక్కముందీ వూరినుండి బయట పడాలి. తెలియనిచోటలో అక్క నొక్క దానినీ యెలా వుంచటం. హైద్రాబాదు అక్కకు పరిచయమైన వూరే. ఉద్యోగం వస్తే అక్కనూ, పిల్లలనూ, అమ్మనూ ముందు పంపిచెయ్యవచ్చు. నెమ్మదిమీద

నాకూ అక్కడ యేదైనా జాబ్ దొరికితే మనం పోదాం. ఒకేవూళ్ళో మనం వేర్వేరు చోటలలోవున్నా అందరం ఒక్కచోట వున్నామనే తృప్తి. ఒకరి కొకరం కాస్త సహాయంగా, రక్షణగా వుండవచ్చు. ఎలా వుంది నా ఐడియా భార్యామణీ!" అల్లరిగా భార్యను నవ్వించి కవ్వించే దృష్టితో అన్నాడు

"బాగుంది. మరి ఇక్కడ వుద్యోగం వదిలేసే అక్కడ దొరకవద్దూ. ఈ సొంత యింటినీ వున్న ఎకరం పొలం ఏంచేద్దాం? అక్కడ ధరలలో మనం బ్రతగ్గలమా? మన బంధువులందరికీ దూరంగా....! నాకేదో భయంగా వుంది-" సాలోచనగా అంది కామేశ్వరి.

"పిచ్చిదానా! యీ సంవత్సరం నేను ఎం. ఏ. ప్యాసయితే అక్కడేదైనా లెక్చరరు పోస్టు వస్తుందేమో చూదాం. ఇల్లు అద్దెకిస్తాం. పొలం కౌలుకిస్తాం. ధరలు పెరిగి బ్రతుకు భారంగా వుంటే యిద్దరం కష్టపడదామోయ్! అయినా నేను యమ్.ఎ. పాసవ్వాలా! అక్కడ ఉద్యోగం రావాలా! అక్కకు ఉద్యోగం రావాలా!? అక్కకు వస్తే అహా( వచ్చిందనుకో— అమ్మా, అక్కా అక్కడ వాళ్ళ సంసారం వాళ్ళు దిద్దుకోగలిగితే మనం వెళ్ళేపనిలేదు. ఒకవేళ వెళ్ళినా అయినవాళ్ళం నలుగురం ఒకచోట వుంటే మిగతా బంధువుల ప్రసక్తి దేనికోయ్! దుఃఖంలో కూరుకుపోయి అక్క అలా వుందేకాని ఆమె నిజానికి నాకన్నా. నీకన్నా అనేకమంది సగటు స్త్రీ పురుషులకన్నా తెలివైనది. సమర్థురాలు. చూడు! ఇందులో నీకు కావలసినంత దండ పెట్టుకుని నాలుగు పువ్వులు చచ్చి స్వర్గానవున్న బావగారి ఫొటో ముందుంచి మిగిలినదండ సునీతకు పెట్టు."

గబగబా కళ్ళు తుడుచుకుని దూరంగా తప్పుకుంది రమ. అమ్మ వడ్డిస్తుంటే ఆరుబయట తులసికోట దగ్గర భోజనంచేస్తున్న పిల్లల దగ్గరకెళ్ళి, సునీత రెండు జడలలో పూలు తురుముతున్న కామేశ్వరిని చూడగానే రమకు దుఃఖం పెలుబికింది. "ఛీ! లోకంలో అందరూ మంచివాళ్ళే" త... యెందుకింత రాక్షసిలా మారిపోయింది. పున్నమిచంద్రుడిలాంటి తమ్ముడ్ని. పుచ్చ పువ్వులాంటి మరదలని. అడుగడుగునా మానసికంగా క్షోభపెడుతూ...." భర్త ఫొటో దగ్గరగా వెళ్ళింది. "మీరేనండీ! మీరే— నా బ్రతుకులో నిప్పులుపోశారు. స్వర్గాన్ని అరిచేతిలో చూపించి ఇది అరఘడియ మాత్రమే నంటే నేనెలా భరించను. మీరులేని యీ ముందు జీవితాన్నంతా నేనొక్కదాన్నే యెలా యీదను. గాలిపటానికి కట్టిన దారంలా మీ స్మృతులనే ఆధారం చేసుకుని జీవించాలా! నా వూహల్లోకి గాని, మనస్సులోనికిగాని. కలల్లోకిగాని వచ్చి నన్నల్లరి పెట్టకండి. ఈ రోజునుంచి నేను ధైర్యంగా, నిశ్చలంగా ముందడుగు వేయాలనుకుంటున్నానండి. నన్నాశీర్వదించండి" బావురుమంది రమ.

గోడకు తగిలించివున్న నిలువెత్తు నారాయణ ఫొటో నవ్వుతున్నట్లుంది. ఆక్షేపిస్తున్నట్లుంది. 'పిచ్చిదానా! యిన్నాళ్ళకు కళ్ళు తెరిచావా!' అన్నట్లు. ఆశీర్వదిస్తున్నట్లున్నది, ఆజ్ఞాపిస్తున్నట్లున్నది. "రమా! నువ్వు మామూలు మనిషివైపో" అని అర్థిస్తున్నట్లున్నది.

గుమ్మంలో రావాలా వద్దా అని అర్ధోక్తిలో ఆగిపోయి ఆందోళనగా తననే చూస్తున్న తమ్ముణ్ణి చూసి ఏడ్చేసింది రమ. "తమ్ముడూ! నన్ను క్షమించరా! నిన్నూ, ఈశ్వరిని చాలా బాధ పెట్టేస్తున్నాను. నేనూ బాధ పడుతుంటాను తర్వాత- కానీ ఈ మానసిక ఆందోళన ఉద్రేకాలనుండి బయటపడలేకపోతున్నాను. ఈ నిరాశా, నిస్పృహల నుండి తప్పించుకోవాలంటే నాకేదైనా వ్యాపకం కావాలిరా! యేదైనా వుద్యోగం యిప్పించరా! ఏదైనా సరే చేస్తాను. ఇంకా చదవాలంటే చదువుతాను." దీనంగా పలుకుతున్న అక్కను యెలా ఓదార్చాలో తెలియక తికమకపడిపోతున్నాడు.

"వదినా!" అంటూ చుట్టుకుపోయింది కామేశ్వరి. "అజ్ఞానంగా నేనూ యెన్నోసార్లు నొప్పించాను నిన్ను. కష్టపెట్టుకోకు వదినా. ఆ క్షణాలలో కోపం యెంత ఆపుకుందామనుకున్నా ఆగేది కాదు."

"ఈశ్వరీ! పిచ్చిపిల్లా"!

ఆ రోజు అందరికీ పండుగులా అనిపించింది. పిల్లలప్రక్కన పడుకున్న రమకు నిద్రపట్టలేదు. "తను తన నిర్ణయాల మీద గట్టిగా నిలబడగలదా? అవన్నీ నీటిమీద రాతలేనా! యథావిధిగా తెల్లరగానే తన చిరుబురులు మొదలవుతాయా? పక్కవీధిలోని శాంతమ్మదీ తనలాంటి బ్రతుకే. పేరుకు మాత్రమే శాంతమ్మ. అశాంతిగా బ్రతికి, అందరి బ్రతుకులలోనూ అశాంతి నింపి గయ్యాళి అని పేరుబడి, అందరిచేత చీదరింపబడి, తిరస్కరింపబడి ఆఖరికి చావరానిచావు చచ్చింది. చచ్చిననాడైనా ఆమె పేరు తలవటానికి ఆమెవాళ్ళెవరూ యిష్టపడలేదు. చివరికి తన బ్రతుకు యిలాగే తయారవుతుందా? ఏమో! తమ్ముడు చాలా తెలివిగా తన బ్రతుకును సరిదిద్దాలని చూస్తున్నాడు. వాడి కృషి


FOR A BETTER JOB'
JOIN
CORRESPONDENCE COURSES
DIPLOMA & OTHER COURSES

- AIBM
- AMIBM
- C. A. (ENTRANCE)
- COMPANY SECRETARY (PREL)
- LL.B.
- M.Ed.
- TEACHER TRAINING
- LIBRARY MANAGEMENT
- APPLIED PSYCHOLOGY
- GIFTED CHILD EDUCATION
- BUSINESS MANAGEMENT
- BUSINESS & INDST. MGT.
- HOTEL MANAGEMENT
- EXPORT MANAGEMENT
- PERSONNEL MANAGEMENT
- ADVERTISING & P.R.
- SALES MANAGEMENT
- MARKETING MANAGEMENT
- ACCOUNTANCY
- JOURNALISM
- GOOD ENGLISH
- HOMOEOPATHY
- PRIVATE SECRETARY
- RAPID SHORTHAND
- PERSONALITY DEVELPMENT
- MEDICAL REPRESENTATIVE

Audio Visual .132

JOB GUIDANCE PROVIDED (FREE)
Few Scholarships are awarded to needy/bright students.
For details, send a self-addressed envelope to Director :
ACADEMY OF CAREERS GUIDANCE
4/177, Subhash Nagar, New Delhi-110 027
Hony. Director S. K. KAPOOR, B.Sc., M.A., M. Ed., M. Phil., M.I.H., AMIBM

ఫలించితే. ఆ ఆలంబన ఆధారంగా తన బ్రతుకులో కళ్యాణి రాగాలను సృష్టించుకోవాలి. చెదిరిపోయిన జీవన సరళిని సరి చేయాలి. తన చిన్నారి సునీత, శ్రీకాంతులను గొప్పవారిని చేయాలి." రాత్రంతా ఆలోచనలతో వేగిపోయిన రమకు తెల్లారే సరికి ఒళ్ళుతెలియని జ్వరం.

జ్వరంలో భర్తను తలవటం. "తమ్ముడూ నన్ను క్షమించు. వుద్యోగం" అంటూ కలవరింతలు. స్పృహ వచ్చినపుడు "నాకు బ్రతకాలని వుండ. చచ్చిపోతానా!" అని ప్రశ్నించటం-పిల్లలను, అమ్మనూ, తమ్ముడికీ, మరదలుకూ ఒప్పగింతలు పెటటం వారంరోజులు నానా హంగామా చేసింది.

"అల్లుడిలాగే కూతురూ తన కన్యాయం చేస్తుందా!! పిల్లల గతేమిటి? వాళ్ళకు దిక్కెవ్వరు? ఆపద మొక్కులవాడా! అనాధరక్షకా! ఎక్కడున్నావయ్యా!! పాహిమాం, పాహిమాం!" అంటూ కనబడని ప్రతిదేవునికి ముడుపులు కట్టి మ్రొక్కుకుంది సుందరమ్మ. బిక్కు బిక్కు మంటూన్న పిలలను అక్కున చేర్చుకుని విలపించేది. డాక్టరు ధైర్యం చెబుతున్నా యింట్లో యెవరికీ కాళ్ళు, చేతులూ ఆడేవికావు రమను అలా చూస్తుంటే.

అందరినీ యింత హడావిడి చేసేసిన రమ పదిరోజులకు మనుషుల్లో పడి పధ్యం తీసుకుంది. తను చేసిన హడావిడికి సిగ్గు పడింది. తీరికగా కూర్చుని తమ్ముడు తీసు కొచ్చే రకరకాల పుస్తకాలు చదివి అర్థం చేసుకునేది. వాటిలో చాలావరకు మన సత్వాలకు చెందినవి. ఇంగ్లీషు యింప్రూవ్ చేసుకొనసాగింది. రోజులు మెల్లగా భారంగా గడుస్తున్నాయి. నిర్లిప్తత పెరిగి పోతోంది. తిరిగి తను రాక్షసి రమ అయి పోతుందా?

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, ఆనందం పంచుతూ ఒక రోజు రెండు ఉత్తరాలు వచ్చాయి. నారాయణ స్నేహితుడు ఆనంద రావు రాసిన దొకటి. నారాయణకు ఆఫీసు ద్వారా అందవలసిన పదిహేను వేల రూపాయలమొత్తం వచ్చాయి. వచ్చి సంతకాలు చేసి రమగారు తీసుకోవలసినదని. రెండవది నారాయణ స్నేహితుడి వద్దనుండి. ఒక ప్రైవేటు కంపెనీలో నెలకు నాలుగొందలు జీతంతో క్లర్కు పోస్టు వుందని. కేవలం నామమాత్రంగా యింటర్వ్యూ జరుగుతుందనీ. ఆ మేనేజరు తనకు బాగా ఆప్తుడు కనుక రమ విషయంలో ఉద్యోగం తప్పకుండా యిస్తానని మాట యిచ్చాడనీ. వుద్యోగం వచ్చినట్లుగానే భావించి యింటర్వ్యూ రోజుకు వుద్యోగంలో చేరిపోవటానికి తగిన సన్నాహాలతో రమ్మనమని వ్రాశాడు. వంశీ ఆ వుత్తరాలు చదవగానే యింట్లో ఆనందం వెల్లి విరిసింది. 'వూరెళతాం!' అనగానే పాప, బాబు కేరింతలు కొట్టారు. నారాయణ పోయాక మొట్టమొదటిసారిగా ఆ యింటికి కొంచెం కళ వచ్చినట్లుంది.

రమ మనస్సులో లక్ష సందేహాలు, భయాందోళనలు. విధవగా యింట్లో కూర్చోవటంవేరు. బయటకు నలుగురిలో మసలటం వేరు. "భగవాన్! నీవే రక్ష!" అనుకుంది. ప్రయాణానికి రెండురోజులముందు వంశీ, కామేశ్వరి ఏలూరు వెళ్ళి ప్రింటున్న తెల్ల చీరలు, లైటు కలర్సు మీద చిన్న ప్రింటున్నచీరలు, తిలకంతెచ్చారు. తెచ్చిన వస్తువులు చూచి సుందరమ్మ, రమ తెల్లబోయారు. రమ మనస్సు ఒక్క క్షణం రెపరెపలాడింది. సుందరమ్మ మొదట 'గయ్!'మన్నా చివరకు మాట్లాడలేదు.

"అక్కా! నీ జీవితంలో మార్పు రావాలి. వసంతం విరియాలి. పోయిన బావ గారిని తేలేనుకాని నీ సుఖం, సంతోషం కొరకు యేది చేయమన్నా చేస్తాను నలుగురిలో వుద్యోగం చేసేదానివి. 'భర్తపోయిన దాననహో' అంటూ నీ రూపంతో దండోరా వేయనక్కరలేదు. అదుగో నీ కిష్టమైన లైటు కలర్సు. తెలుపుమీద ప్రింటున్న చీరలు తెచ్చాను. కుంకుమకు అభ్యంతరమేమోగాని తిలకాని కదిలేదు. మొదట్లో ఎబ్బెట్టుగా వుంటుం దనుకుంటే చిన్ని బొట్టు కనీ కనిపించకుండా పెటుకో. రోజు రోజుకూ పెద్దదిగాపెట్టుకోవచ్చు. దేశంలో మార్పు రావాలనేవారే అందరూ. దానిని నీతోనే యెందుకు ప్రారంభించ కూడదు. "ధైర్యే సాహసే లక్ష్మీ!" అన్నారుపెద్దలు. ధైర్యంగా నీ కాళ్ళమీద నువ్వు నిలబడి నీ బ్రతుకులోని వెలితిని పూరి చేసుకో అక్కా! మళ్ళీ నీ జీవితం చిగురించి విరియాలి. నీ చల్లని చూపుల నీడలో పిల్లలు పెరగాలి."

స్థాణువులా నిల్చున్న రమ కామేశ్వరి చిన్న బొట్టు దిద్ది చిన్న బోర్డరున్న పువ్వులున్న లేతగులాబీ రంగు చీరపైన కప్పే సరికి మెలకువ వచ్చినట్లుగాఆగి చూచింది. పిల్లలు-"అమ్మా! భలే బావున్నావు రోజూ యిలానేవుండు" అంటూ ఆశగా చూశారు. తమ్ముడి కళ్ళలో తృప్తి. లోకానికి వెరచిగాని, సుందరమ్మకు కూతురు నిండుగా అలా కన్పించేసరికి కళ్ళలో నీళ్ళూరాయి. ఈశ్వరి స్నేహపూర్వకంగా, అభిమానంగా అభినందనగా చేతులు నొక్కింది. ఎంత అదృష్టవంతురాలు తాను భగవాన్! నాకు ఈ జన్మకీ అదృష్టం చాలు. ఇంత మంది మంచి మనసులలో, మనుషులలో వుండటమే అదృష్టం. తన ఈ మార్పు జీవితంలో కొత్త చిగురులు తొడగాలి. ధైర్యంగా చిర్నవ్వు నవ్వింది. హాయిగా నిట్టూర్చింది. నా బిడ్డ నిజంగా 'రమాదేవే' అంటూ ఉప్పుగళ్ళు, ఎండుమిరపకాయలు తెచ్చి కూతురి చుట్టూ దిప్పి బయటికెళ్ళింది సుందరమ్మ. తనకు 'కొత్త జీవితాన్ని' ప్రసాదించిన తమ్ముడిని మనస్సులోనే అభినందించింది రమ. ●





## సినిమా తారలు

నేటిమేటి సినీ తారలు శ్రీదేవి, సుజాత, జయసుధ, జయప్రదల ఫొటోల సెట్టు కావాలంటే 5 రూ॥లు. కేవలం ఒకే ఫొటో కావాలంటే రూపాయిన్నర. పాత కొత్త నటీనటుల, దర్శకుల, రచయితల, సినీ నిర్మాణ సంస్థల అడ్రసులు-ఫోను నెంబర్లుగల పుస్తకం కావాలంటే 2 రూ॥లు ఈ క్రింది అడ్రసుకు మని యార్డరు చేయండి.

వై. కె. మూర్తి,
దాసరివారి వీధి, విజయవాడ-2.

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ వైద్యం!



హస్తప్రయోగం, అంగము చిన్నదై అతుకుర కొలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వార కూడా వైద్యం చేయబడును, వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి.

డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడివద్ద, తెనాలి.

SUVARNA

బ్రాంచి : 5/1, బ్రాడిపేట, గుంటూరు-2